
వివరాలు మెయిన్‌లో

**ప్రతి గింజా కొనుగోలు చేస్తాం**


ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

ఆదివారం | 18 అక్టోబరు , 2026 | పేజీలు : 5


# తాగునీటి సమస్య పరిష్కరిస్తా

### ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి

### రైతులకు అన్యాయం జరగకుండా గిట్టుబాటు ధర



**ప్రజాపక్షం/త్రిపురారం** : మండల కేంద్రంలోని దుబ్బ కాలనీలో గత కొంతకాలంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని,దానిని పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే జైవీర్ రెడ్డికి గ్రామ ప్రజలు వినతిపత్రం అందజేశారు. శనివారం ఎమ్మెల్యే మండల కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా సర్పంచ్ బైరం లక్ష్మి కృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆయనను కలిసి సమస్యను వివరించారు.దుబ్బ కాలనీకి కొత్త వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని,తాగునీటి సరఫరాను క్రమబద్ధీకరించాలని కోరారు. వేసవి సమీపిస్తున్నందున తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ.. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ**

మండలంలోని 51 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఉన్నటువంటి రైతు వేదికలో శనివారం తహసిల్దార్ గాజుల ప్రమీల ఆధ్వర్యంలో కళ్యాణ్ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయగా ఆయన పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు.రైతులకు పంట పొలాలకు నీటి సమస్య ఏర్పడ్డా గాని సాగర్ లో ఉన్న నీరు కూడా పంట పొలాలకు అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని తెలిపారు.ఏదేమైనా రైతులకు అన్యాయం జరగకుండా వరి ధాన్యానికి గిట్టుబాటు ధర నిర్ణయించడం జరిగిందని తెలియజేశారు. మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లంపల్లి జానయ్య, మాజీ అధ్యక్షుడు ముడిమల్ల బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు అనుముల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మానిటరింగ్ డైరెక్టర్ భాస్కర్ నాయక్,నాయకులు అంబటి సోమయ్య, మాజీ సాగర్ యూత్ అధ్యక్షుడు కసిరెడ్డి నరేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు డ్రిప్ వెంకట్ రెడ్డి,ఉప సర్పంచ్ అనుముల నాగమణి పాపిరెడ్డి పాల్గొన్నారు.

### దసరా పండుగకు ముస్తాబైన

# తవకలాపూర్ పల్లె

**వీధి దీపాల వెలుగులు.. పరిశుభ్రమైన రహదారులు.. దోమల నివారణకు ఫాగింగ్**

**పండుగకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసిన సర్పంచ్ కృష్ణయ్య**

**ప్రజాపక్షం/డిండి:** పల్లె పండుగకు ముస్తాబైంది.. పట్నం నుంచి వచ్చే బిడ్డల కోసం పచ్చని పల్లె ప్రేమతో ఎదురుచూస్తోంది! దసరా పండుగ వేళ సొంతూళ్లకు చేరుకునే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నల్లగొండ జిల్లా తవకలాపూర్ గ్రామం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది.గ్రామ సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య గత పది రోజులుగా ప్రత్యేక చొరవ తీసుకుని వీధి దీపాలు, పారిశుధ్యం, దోమల నివారణ,తాగునీటి సరఫరాపై దృష్టి సారించి పల్లెను పండుగ శోభతో తీర్చిదిద్దారు.పండుగ పూట ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.అలాగే తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా వాటర్ ట్యాంకులు,బోర్ల పనితీరును పరిశీలించి,ప్రజల అవసరాలకు అనుగుణంగా నీటి వసతి అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. పండుగ వేళ సొంతూళ్లకు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో గ్రామంలో అవసరమైన పనులను పూర్తి చేయించారు.పట్టణాల నుంచి సొంతూరికి వచ్చే ప్రజలకు సాదర స్వాగతం



పలికేలా తవకలాపూర్ గ్రామం ముస్తాబవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**పండుగ వేళ ప్రజలకు ఇబ్బందులు కలగకూడదన్నదే లక్ష్యం: సర్పంచ్ పొన్నగంటి కృష్ణ**



దసరా పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చే ప్రతి ఒక్కరికీ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నదే తమ లక్ష్యమని తవకలాపూర్ సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య అన్నారు. పండుగకు సొంతూరికి



వచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండాగ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని,ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని కోరారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

### మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు,ఆడపడుచులందరికీ తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మన రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిందని తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే గొప్ప సంప్రదాయం తెలంగాణ బతుకమ్మ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి,ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల ఐక్యతకు, సోదర భావానికి నిదర్శనమని అన్నారు. ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత బతుకమ్మ పండుగకు దక్కుతుందని తెలిపారు.

## సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు : మంత్రి



**ప్రజాపక్షం/నల్లగొండ** : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు,ముఖ్యంగా ఆడబిడ్డలకు రాష్ట్ర రోడ్లు,భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.ప్రకృతిని పూజించి,బతుకును కొలిచే గొప్ప పండుగ బతుకమ్మ అని,తొమ్మిది రోజులుగా ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్న బతుకమ్మ సంబరాలు సద్దుల బతుకమ్మతో పరిసమాప్తం అవుతాయని అన్నారు.రాష్ట్రంలోని ప్రతి ఇంటా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని, ఆడపడుచుల జీవితాల్లో బంగారు పంటలు పండాలని ఆ బతుకమ్మ తల్లిని మనసారా కోరుకుంటున్నానని తెలిపారు. తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని,తెలంగాణ ఆడబిడ్డల ఐక్యతను చాటే పండుగ ఇదని మంత్రి అన్నారు.అందరూ సుఖ సంతోషాలతో సద్దుల బతుకమ్మను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్,ఆయన సతీమణి పూజా పవార్,పోలీస్ కుటుంబ సభ్యులు, మహిళా పోలీస్ సిబ్బంది, ఇతర అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళలు ఆడిపాడుతూ పండుగ సందడిని నింపారు. జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ,దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్, ఎస్బిడీఎస్పి మల్లారెడ్డి,సీఐలు మంజుల,నాగరాజు,ఎస్ఐలు శ్రావణి, అమ్రీన్, మమత, ఆర్ఐలు సంతోష్, సూరపు నాయుడు, కళ్యాణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.





## వాటర్ ఫిల్టర్ అందజేతత

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సేవారత్న అవార్డు గ్రహీత ప్రోగ్రాం ఛైర్మన్ ఐపీసీ మిర్యాల శత్రయ్య అధ్యక్షతన వాసవీ మాత టీం ఆధ్వర్యంలో శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీమాత టీం ఆర్టీసీ బస్టాండ్ వద్ద వేసవికాలంలో చలివేంద్రాన్ని గత పది సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని అన్నారు. అదేవిధంగా ఆర్టీసీ డీఎం రామ్మోహన్ ఆధ్వర్యంలో ప్రయాణీకులకు పులిహోరా, పెరుగన్నం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుండా మల్లయ్య, జనార్ధన్, రంగా శ్రీను, గుండా వెంకటేష్, ఉపేందర్, శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీను ఉన్నారు.

## ఓటు నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని బిసి జాతీయ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చెన్నగాని బాల కృష్ణగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని బిసి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని, అర్హత ఉన్న పట్టభద్రులు ఎవరూ ఓటు నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలకు చెందిన పట్టభద్రులు ఐక్యంగా ముందుకు వచ్చి బిసి వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసి అభ్యర్థులకు మద్దతుగా నిలిచి వారి విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## యువతకు ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/చిట్యాలః** రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి యువతకు పలు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని నల్లగొండ జిల్లా నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం రోజున చిట్యాల పట్టణంలో పట్టభద్రుల ఓటు నమోదు అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగులకు భృతి కల్పిస్తామని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని ఆరోపించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు, పట్టభద్రులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ సమస్యపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును నమోదు చేసుకోవాలని చిరుమర్తి సూచించారు. మాజీ సర్పంచ్ జడల ఆదిమల్లయ్య, బిఆర్ఎస్ నాయకులు మెండె సైదులు, జమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆగు అశోక్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు స్థానిక శ్రీశ్రీశ్రీ కనకదుర్గ ఆలయంలో చిరుమర్తి ప్రత్యేక పూజలను నిర్వహించారు.



హైదరా బాద్ శిల్పకళావేదికలో బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ అవార్డు లకు జ్యూరీ సభ్యునిగా నియమింపబడిన మిర్యాలగూడ వాసి వాకిటి మధును శనివారం హైదరాబాద్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందించి మెమెంటో అందజేశారు. ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు ఉన్నారు.
-ప్రజాపక్షం/ మిర్యాలగూడ



## నేరేడుచర్ల లయన్స్‌క్లబ్ సేవలకు దక్కిన గౌరవం




**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నల్లగొండ పట్టణంలోని శనివారం నిర్వహించిన 320ఈ2025/26 జిల్లా స్థాయి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నేరేడుచర్లకు విశేష గుర్తింపు లభించింది. సామాజిక సేవా కార్యక్రమాల్లో అందించిన సేవలకు గుర్తింపుగా ఉత్తమ్ క్లబ్ అవార్డు విభాగంలో అధ్యక్షులు కీతా కనకయ్య, డిస్ట్రిక్ చైర్‌పర్సన్ విభాగంలో లయన్ బట్టు మధు, ఉత్తమ సెక్రటరీ విభాగంలో లయన్ యూసఫ్, ఉత్తమ ట్రెజరీ విభాగంలో లయన్ సరికొప్పుల నాగేశ్వరరావు, గవర్నర్ లయన్ మదన్‌మోహన్, రేపాల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ అవార్డులు క్లబ్ సభ్యుల సేవాస్ఫూర్తికి, సామాజాభివృద్ధి కోసం చేస్తున్న కృషికి నిదర్శనం అన్నారు.

## జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్లుగా నియామకం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** జిల్లా విజిలెన్స్ కమిటి మెంబర్లుగా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన గల్లా వెంకటేశ్వర్లు, పోతుల జ్ఞానయ్య లు నియామకం అయ్యారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎండి అజీజ్‌పాషా ఆధ్వర్యంలో వారికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటి మెంబర్లుగా నియమించిన మంత్రివర్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నూతనంగా ఎస్సీ, ఎస్టి విజిలెన్స్ కమిటి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటిలో నియామకమైన గల్లా వెంకటేశ్వర్లు, పోతుల జ్ఞానయ్యకు శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో శాలువాలు, పూల మాలలతో సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర పెరిక కార్పోరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గెల్లి రవి మాట్లాడుతూ జిల్లా ఎస్సీ, ఎస్టి విజిలెన్స్ కమిటి సభ్యులుగా నియామకమైన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు గొట్టె రామయ్య, అట్లూరి హరిబాబు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, ఎంఎ అబ్దుల్ మజీద్‌బాయ్, సమ్మెట సుబ్బరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/చింతలపాలెం :** యువత క్రీడల్లో రాణించి మంచిపేరు తెచ్చుకోవాలని తహశీల్దార్ రామకృష్ణారెడ్డి, ఎంపిడిఓ ఆండాలు, ఎస్ఐ పరమేష్ అన్నారు. మండల కేంద్రంలో దసరా పండుగ సందర్భంగా శ్రీవేంకటేశ్వర యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ సర్కిల్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలతో మంచి స్నేహబంధాలు ఏర్పడడంతో పాటు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జంగాల అనంతమ్మ పుల్లయ్య, సిపిఐ జిల్లా నాయకులు ఉస్తెల నారాయణరెడ్డి, మండల కార్యదర్శి సిహెచ్ రవి పాల్గొన్నారు.



## అన్నదానం గొప్పది

**ప్రజాపక్షం/మునగాల:** అన్ని దానాల్లో కన్న అన్నదానం చాల గొప్పదని సర్పంచ్ చల్లా గురవయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామంలో దుర్గభవాని ఉత్సవ కమిటి వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి కాలె సామేలుతో కలిసి ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొప్పుల వీరమ్మ, వార్డు మెంబర్ రమనబోయిన రమేష్, బాల్నె శ్రీనివాస రెడ్డి, చేగొండి శ్రీనివాస్, రాంబాబు, ఉత్సవ కమిటి సభ్యులు మండవ రంజీత్‌గౌడ్, యాట రవి, రావుల పెంట శ్రీను పాల్గొన్నారు.





## ఉమ్మడి నల్గొండ జిల్లా బిసిలకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వచ్చే నెలలో భర్తీ చేయనున్న గవర్నర్ కోటా నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవుల్లో ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన బీసీలకు అవకాశం కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ కోరారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్‌తో శనివారం మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి ఆయన వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీల జనాభా దామాషా ప్రకారం రాజకీయ పదవుల్లో వాటా కల్పించాలని పేర్కొన్నారు. అర్హత, అనుభవం, ప్రజాసేవ పట్ల నిబద్ధత కలిగి, అధికార పదవులు లేకపోయినా పార్టీ కోసం పనిచేసిన బీసీ నాయకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఇలా అవకాశాలు కల్పించడం ద్వారా అన్ని సామాజిక వర్గాలకు తగిన ప్రాతినిధ్యం లభించి సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. నామినేటెడ్ పదవులన్నీ ఒకే సామాజిక వర్గానికి కేటాయించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు, గజ మహేష్, బంటు సైదులు, రాంబాబు యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటును నమోదు చేసుకోవాలి



**ప్రజాపక్షం/మునగాల:** త్వరలో జరగనున్న నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు విధిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తక్కెళ్లపాటి సాయి అన్నారు. శనివారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలో ఎమ్మెల్సీ ఓటు నమోదుపై ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాంరెడ్డి సర్వోత్తమరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి కాలె సామేలు, నియోజకవర్గ యువజన ఉపాధ్యక్షులు నర్ర నవీన్‌రెడ్డి, జిల్లేపల్లి శ్రీను, రావులపెంట సతీష్, వీరారెడ్డి, చేగొండి శ్రీను, యూసఫ్, పాషా, మాదాసు నాగయ్య, జిల్లేపల్లి రమేష్ పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఆకాంక్షించినట్లు తెలిపారు. శనివారం మండలంలోని లింగాల గ్రామ సర్పంచ్ గార్లపాటి స్వర్ణ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో దేవి ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమ్మవారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటి సభ్యులు, స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.





## ఓంకార్ ఆశయ సాధనకు ఐక్యంగా పోరాడాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఎంసీపీఐయూ వ్యవస్థాపక నేత మద్దికాయల ఓంకార్ ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాలని ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యులు వస్కుల మట్టయ్య, జిల్లా కార్యదర్శి సైదమ్మలు పిలుపునిచ్చారు. శనివారం యాద్గార్‌పల్లి గ్రామంలో మద్దికాయల ఓంకార్ 18వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ జిల్లా నాయకులు, గ్రామ నాయకులు భరత్, విశాలాంధ్ర, మౌనిక, ఝాన్సీ, కార్తీక్, సుకన్య, అన్విష తదితరులు పాల్గొన్నారు.

## యాదవ కమ్యూనిటీ హాల్‌కు నిధులు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోనిపందెనపల్లి గ్రామ యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని సంఘం నాయకులు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.గ్రామంలో 100కు పైగా యాదవ కుటుంబాలు ఉన్నాయని, సమావేశాలు నిర్వహించుకునేందుకు భవనం లేక ఇబ్బందులు పడుతున్నామని గతంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి నిధులు మంజూరు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి,సీనియర్ నాయకుడు గద్దపాటి దానయ్య, మాజీ సర్పంచి ముప్పిడి యాదయ్య, మాజీ ఉపసర్పంచి గజ్జి రవి, యాదవ సంఘం పెద్దలు గొల్ల ముప్పిడి చిన్న యాదయ్య, సారి గొల్ల సంకటి పెద్ద నరసయ్య, కంకణం గొల్ల గజ్జి అంజిబాబు,కావటి యాదగిరి,ఆవుల నరసింహ, గజ్జి నాగరాజు, ముప్పిడి గోపాలు, ముప్పిడి నాగరాజు, పగడాల వీరయ్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వేముల పరామర్శ

**ప్రజాపక్షం/నకిరేకల్:** మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డుకు చెందిన దీకొండ ధనమ్మ,16వ వార్డుకు చెందిన జోర్రిగల అబ్బయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి,ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు లింగాల వెంకన్న,సీనియర్ నాయకులు పన్నాల రాఘవరెడ్డి , చౌగోని శ్రీనివాస్,గాజుల సుకన్య శ్రీనివాస్, యాసరపు వెంకన్న, ఘర్షకోటి సైదులు తదితరులు పాల్గొన్నారు.



## దుర్గామాత ఆలయ షెడ్డు ప్రారంభం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని తడకమళ్ల గ్రామంలో దుర్గామాత ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్మించిన షెడ్డును ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ ప్రారంభించారు. శనివారం గ్రామంలో నిర్వహించిన దుర్గామాత పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి సహకారంతో, ఎమ్మెల్సీ నిధులతో నిర్మించిన ఆలయ షెడ్డును ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. గ్రామానికి ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ రాకతో గ్రామస్థులు, భక్తులు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అమ్మవారి నామస్మరణల మధ్య ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎండ, వర్షాల నుంచి ఇబ్బందులు పడకుండా షెడ్డును నిర్మించడం పట్ల గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు, ఆలయ అభివృద్ధికి సహకరించిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేక సైదులు, ఉప సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ జానారెడ్డి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ కట్టంగూర్ కింగ్స్‌కు అవార్డుల పంట

**ప్రజాపక్షం/కట్టంగూర్ :** కట్టంగూర్ లయన్స్ క్లబ్ కింగ్స్‌కు 2025/26 సంవత్సరంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలకు జిల్లా స్థాయిలో ఐదు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించాయి.శనివారం నల్లగొండలోని లక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ 320E ఫాస్ట్ గవర్నర్ మదన్ మోహన్ రేపాల చేతుల మీదుగా అవార్డులు అందజేశారు.క్లబ్ అధ్యక్షుడు చిక్కు శేఖర్‌కు ఎక్సలెంట్ ప్రెసిడెంట్,కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్‌కు ఎక్సలెంట్ సెక్రటరీ, కోశాధికారి పోగుల రాములుకు ఔట్‌స్టాండింగ్ ట్రెజరర్ అవార్డులు లభించాయి.వీటితోపాటు డిస్ట్రిక్ట్ సర్వీస్ అవార్డు, ఎక్సలెంట్ క్లబ్ అవార్డులను క్లబ్‌కు అందజేశారు.కట్టంగూర్ మండలంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు,బీపీ,షుగర్ పరీక్షలు,ఉచిత కంటి ఆపరేషన్లు, పేదలకు ఆహారం అందించే ‘మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాలను నిర్వహించినట్లు చిక్కు శేఖర్ తెలిపారు.బతుకమ్మ,సంక్రాంతి, దసరా వేడుకలను ప్రజల మధ్య నిర్వహించామన్నారు.అవార్డులు మరింత బాధ్యతను పెంచాయని,భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.క్లబ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు అవార్డు గ్రహీతలను అభినందించారు.కార్యక్రమంలో ఫాస్ట్ జోన్ చైర్మన్ బుడిగ శ్రీనివాస్,జోన్ చైర్మన్ డెంకెల సత్యనారాయణ,జీఎస్టీ కోఆర్డినేటర్ ఎర్ర శంబు శివలింగారెడ్డి,మంగదుడ్ల శ్రీనివాస్,కల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




## విద్యుత్ భారాలపై ప్రభుత్వం పునరాలోచించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ట్రూఅప్ పేరుతో విద్యుత్ వినియోగదారులపై అదనపు భారాలు మోపాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తున్న తీరును వెంటనే విరమించుకోవాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పరంగి రాము డిమాండ్ చేశారు. శనివారం మిర్యాలగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ట్రూఅప్ పేరుతో రూ. 5,420 కోట్ల అదనపు చార్జీల వసూళ్లకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి అనుమతినివ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. మొత్తం రూ. 7,635 కోట్ల ట్రూఅప్ మొత్తంలో రూ. 5,420 కోట్లను వ్యవసాయేతర విద్యుత్ వినియోగదారుల నుంచి డిస్కమ్‌లు వసూలు చేయనున్న నేపథ్యంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ 2026 విద్యుత్ బిల్లుల నుంచి ఈ అదనపు వసూళ్లు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ వసూళ్లు ఒక్క నెలతో ముగిసేవి కాదని, దక్షిణ డిస్కం పరిధిలో 29 నెలల పాటు, ఉత్తర డిస్కం పరిధిలో 26 నెలల పాటు నిర్ణీత విధానంలో వసూలు చేయనున్నారని చెప్పారు. టీయూసీసీ జిల్లా కన్వీనర్ ఎం.డి. జలీల్ బాబా, ఏఐవైఎల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్‌కుమార్, నాగరాజు, ఏఐఏకేఎస్ జిల్లా నాయకులు ప్రసాద్, నాగరాజు, కృష్ణయ్య, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షులు నసీర్ బాబా, శ్రీను, ఆదినారాయణ, లక్ష్మయ్య, రవికుమార్, మురళి, ఏఐఏఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పద్మ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి




**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నార్కట్‌పల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గామాత మండపాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం దర్శించుకుని అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు నకిరేకల్ నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య,మండల పార్టీ అధ్యక్షుడు గాయం శ్యాంసుందర్ రెడ్డి,పాశం శ్రీనివాస్ రెడ్డి, మట్టిపల్లి శ్రీనివాస్ యాదవ్,పుల్లెంల అచ్చాలు గౌడ్,వెంకటేశ్వర్లు,ప్రజ్ఞాపురం సతీష్,కంబాలపల్లి మల్లేష్, మాదాసు నరసింహ,రాధారపు బిక్షపతి, గొలుసుల చందు పాల్గొన్నారు.



## అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతీ ఒక్కరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ చేసిన కృషిని కొనియాడారు. అనంతరం బుర్జుబావి గ్రామంలో రూ. 20లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందిచడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ పాలనను సులభతరం చేయడం, అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ అండెం సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరి గౌడ్, మోత్కూర్ మార్కెట్ కమిటి చైర్మన్ విమల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు కురుమెల్ల కవిత శ్రీను, వల్లాల రమేష్, బిక్షం, మహేందర్, హరితాదేవి, రామ్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త మల్టిపుల్ డే ధర్నాలను జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా నిరసిస్తూ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న దేశవ్యాప్త మల్టిపుల్ డే ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి.సలీం పిలుపునిచ్చారు. శనివారం మిర్యాలగూడలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టపరమైన హక్కులను బలహీనపరుస్తూ నూతన లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతమ రెడ్డి, సహాయ కార్యదర్శి రవినాయక్, పట్టణ కన్వీనర్ తిరుపతి, రామూర్తి, జిల్లా నాయకులు రొండి శ్రీను, కోడిరెక్క మల్లయ్య, చెల్లమల జయచంద్ర, దేవయ్య, కంచి కేశవులు, బొంగారాల వెంకటయ్య, రామారావు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నివారణకు ప్రజలే ముందుకు రావాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి గ్రామంలో స్టీల్ ప్లేట్ బ్యాంకులు ఏర్పాటు చేసుకోవాలని కట్టంగూర్ ఎస్ఐ మునుగోటి రవీందర్ పిలుపునిచ్చారు. మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన గద్దపాటి రవి తన కుమారుడు రోహిత్ పుట్టినరోజు సందర్భంగా,తాత గద్దపాటి రాములు జ్ఞాపకార్థం ఆర్ఆర్ఆర్ కన్సల్టెన్సీ తరఫున గ్రామపంచాయతీకి 300 స్టీల్ ప్లేట్లు, గ్లాసులను శనివారం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శుభకార్యాల్లో ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా స్టీల్ ప్లేట్లు వినియోగించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.సొంత గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం రవి చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. గ్రామ సర్పంచి విప్పలపల్లి అనిత శ్రీనివాస్,ఉపసర్పంచి చింత నాగార్జున,గ్రామ కార్యదర్శి వెంకన్న పాల్గొన్నారు.






## గెలుపే లక్ష్యంగా పట్టభద్రులు పనిచేయాలి

**ప్రజాపక్షం/నడిగూడెం:** కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పట్టభద్రులు పనిచేయాలని సర్పంచ్ రాజేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చెన్నకేశవపురం గ్రామంలో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రీయలో భాగంగా మండల యూత్ అధ్యక్షులు గుండు మహేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు పగిళ్ల ఉపేందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటు నమోదుపై ప్రచార కార్యక్రమం నిర్వహిచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమరెడ్డి ఎమ్మెల్సీగా గెలుప్తే లక్ష్యంగా పట్టభద్రులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుల్లయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివరాత్రి ఉపేందర్, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా పథకం అందుకున్న జిల్లా అదనపు ఎస్‌పి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కారాల్లో సూర్యాపేట జిల్లా అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి పోలీసు ఉత్తమ సేవా పతకం లభించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ డిజిపి కార్యాలయంలో రవీందర్ రెడ్డికి పతకాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి కె. నరసింహ ఆయనను అభినందించారు. పోలీసు శాఖలో సుదీర్ఘకాలంగా వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు విలువైన సేవలు అందించారని, విధి నిర్వహణలో చూపిన అంకితభావం, కృషి అభినందనీయమని కొనియాడారు.

## 26న ఛలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో అక్టోబర్ 26న తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాలడుగు సుధాకర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ఈ కార్యక్రమ సన్నాహకాల్లో భాగంగా, సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ యూనియన్ నాయకులు వల్లపుదాసు సాయికుమార్‌తో పాటు పలువురు కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.



## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేపీసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెకు శనివారం ఆయన మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఎన్హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న వీరికి పని భారం కొండంత,వచ్చేది మాత్రం గోరంత అని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు వేతనాలు పెంచి వారి జీవితాలు నిలబెట్టిందని,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలైనా ఇచ్చిన హామీ నిలబెట్టుకోకుండా తాత్సారం చేస్తోందని ఆరోపించారు.అనంతరం టీఎన్‌జిఓస్ జిల్లా నాయకులు అధ్యక్షులు నాగిళ్ల మురళి,శేఖర్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్టే మల్లిఖార్జున రెడ్డి,మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు లొడంగి గోవర్ధన్,మాజీ సర్పంచ్ కోట్ల జయపాల్ రెడ్డి,కోట్ల అశోక్ రెడ్డితో పాటు పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో విఎ.రాజు,డాక్టర్ సైదులు,ఉపేందర్,డాక్టర్ రమేష్,అనిల్,సంతోష్,డాక్టర్ ప్రియాంక,ఉద్యోగులు పాల్గొన్నారు.

## డిండి ఆయకట్టు రైతుల పంటలకు నీళ్లు ఇవ్వాల్సిందే...

**ప్రజాపక్షం/దేవరకొండ;** డిండి ఆయకట్టు రైతుల పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని ప్రభుత్వం కెఎల్ఐ ద్వారా డిండి ప్రాజెక్టులోకి నీటిని తీసుకొచ్చి రైతుల పంటలను కాపాడాలని బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ యువ నాయకులు వడ్త్య చైతన్య నాయక్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ డిండి ఆయకట్టు పరిధిలో దాదాపు 15వేల పై చిలుకు ఎకరాలలో వరి సాగు చేసుకోవడం జరిగిందని చివర దశ వరి పొట్టదశలో ప్రస్తుతం నీరు అవసరం అని చాలా గ్రామాల్లో పంటలు ఎండుతున్నాయని అన్నారు. ప్రాజెక్టులో నీళ్లు లేనందున పంటలకు నీరు అందడం లేదని కల్వకుర్తి లిఫ్ట్ ద్వారా డిండి ప్రాజెక్టును నింపి రైతులను ఆదుకోవాలని అన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ద్వారా సమస్య పరిష్కారానికి స్థానిక ఎంఎల్‌ఏ చొరవ తీసుకొని రైతుల పంటలను కాపాడాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు నష్టపరిహారం అందించాలని, వ్యవసాయానికి 16 గంటల నాణ్యమైన విద్యుత్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని, లో వోల్టేజ్ సమస్యతో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం వలన బోర్లు, బావుల వద్ద పంటలు ఎండిపోతున్నాయని తక్షణమే వ్యవసాయాని 16 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆయన డిమాండ్ చేశారు చేశారు.

## రైతులు పంటసాగు చేసి నష్టపోకుండా అవగాహన




**ప్రజాపక్షం/అర్వపల్లి :** రైతులు ఈ యాసంగి సీజన్‌లో వరి పంటను సాగు చేయకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలని సాగుచేస్తే నష్టపోతారని అందుకు ఆరుతడి పంటలను సాగుచేయాలని మండల ప్రత్యేక అధికారి ఏడిఏ జి. శ్రీధర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల అభివృద్ధి అధికారి పి. ఝాన్సీ అధ్యక్షతన వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, వివిధ శాఖలకు చెందిన అధికారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావం మూలంగా ఉష్ణోగ్రత శాతం పెరిగిందని వర్షాలు కురవకపోవడం మూలంగా బోర్లు నీటిమట్టం పడిపోతున్నాయన్నారు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయే పరిస్థితి ఏర్పడిందని అందుకు రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ బి. శ్రీకాంత్, ఇంచార్జి ఎంపిఓ నవీన్, విద్యుత్ ఏఈ శ్రీకాంత్, ఎంఈఓ బాలు నాయక్, గ్రామ సర్పంచులు చిల్లంచర్ల విద్యాసాగర్, కర్నాటి వెంకన్న, వీరాంజనేయులు, నున్న యాదగిరి, శైలేందర్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## క్రియాశీలక ఉద్యమాలతోనే బుల్లెట్ ట్రైన్ కారిడారు సాధ్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తరాల నుండి సూర్యాపేటకు రైల్వే కారిడార్ సాధన కోసం ఎదురుచూస్తున్న సూర్యాపేట జిల్లా ప్రజలు క్రియాశీలక ఉద్యమాల ద్వారా మాత్రమే సాధించుకోగలుగుతారని పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని నిరసన శిభిరం వద్ద రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో భాగంగా 65వ రోజు శిభిరం వద్ద పోరాటాలకు సంకేతమైన పోరు బతుకమ్మను పూలతో అలంకరించి పోరు పాటలు పాడి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేటకు రైలు మార్గం కోసం ఎదురు చూసిన ప్రజలు తమ కలలు సాకారం చేసుకునేందుకు ఇదే సరైన సమయం అన్నారు. అంతర్గత, బహిర్గత విచ్ఛిన్న శక్తులు ఎన్ని కుట్రలు పన్నినా రైల్వే కారిడార్ సాధన ఉద్యమం ఆగదని అన్నారు. రైల్వే కారిడార్ సాధన కోసం ఇకముందు క్రియాశీలక ఉద్యమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రేపాక లింగయ్య, జిల్లా కార్యదర్శి పాల్వాయి బిక్షం, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, డాక్టర్ భూమిరెడ్డి, పేర్ల నాగయ్య, ఎర్ర అఖిల్ కుమార్, గొడ్డలి నర్సయ్య సంఘీభావం తెలిపారు.



## ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలి

**ప్రజాపక్షం/చింతలపాలెం :** ప్రజలు ఉచిత వైద్యశిభిరాలను సద్వినియోగపర్చుకోవాలని గ్రామ సర్పంచ్ గుగులోత్ శ్రీను అన్నారు. శనివారం మండలంలోని నక్కగూడెం గ్రామం నందు డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైన నేపథ్యంలో గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని రక్షించేందుకు, ముందస్తు జాగ్రత్త చర్యగా ఒక ప్రత్యేక ఉచిత వైద్య శిభిరాన్ని సర్పంచ్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు జ్వరాల బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్య శిభిరంలో మొత్తం 96 మంది రోగులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ భూక్య సుధాకర్ నాయక్, ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ వినయ్, డాక్టర్ నిఖిల్ నిరూపమ్, ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ అఖిల, హెల్త్ సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, సూపర్‌వైజర్ వినోద, ఏఎన్‌ఎంలు గోవిందమ్మ, సుజాత, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకారుల ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు తోగిటి మురళి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయ ఆవరణలో ఈనెల 24న హైదరాబాద్‌లో సరూర్‌నగర్ గ్రౌండ్ జరిగే స్వర్ణకార శంఖారావం భారీ బహిరంగ సభ వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో స్వరాష్ట్ర ఉద్యమంలో విశ్వబ్రాహ్మణ పాత్ర గణనీయమైందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం సలహాదారుడు నారాయణదాసు రామాచారి, జిల్లా కోశాధికారి బాణాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఆకారపు పరిపూర్ణ, జనరల్ సెక్రటరీ నారాయణదాసు నరసింహచారి, అమరావతి దామోదర్ చారి, బ్రహ్మచారి, సురేష్, నాగేంద్రచారి, గోపి, ఉల్లి సుధాకర్, రాంబాబు, నరసింహాచారి, భాస్కరాచారి, వీరాచారి పాల్గొన్నారు.

## శక్తి స్వరూపిణిని పూజించే గొప్ప పండుగ దేవీనవరాత్రులు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని పూజించే గొప్ప హిందూ పండుగ దేవి నవరాత్రి ఉత్సవాలని 37వ వార్డు కౌన్సిలర్ బైరు శైలేందర్ గౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని 37వ వార్డు పిఎస్ఆర్ సెంటర్‌లో శ్రీదుర్గామాత కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బిఆర్ఎస్ నాయకులు టైసన్ శ్రీనుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. గతంలో మొట్టమొదటగా లక్కీ డ్రాలో బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని ఏర్పాటు చేసి అందరికి ఆదర్శంగా నిలిచారని తిరిగి మరో అడుగు ముందుకేస్తూ మొదటి ప్రైజ్ బుల్లెట్ బైక్, రెండవ పల్సర్ బైక్ లక్కీ డ్రాలో ఏర్పటు చేయడం అభినందనీయమన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు నిష్టగా అమ్మవారిని పూజించి అమ్మవారి కృప కరుణకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిండిగ విజయకుమార్, నర్సింగ్ కిరణ్, షేక్ గౌస్, డాక్టర్ అంతటి అనిల్, కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





## విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా నాగరాజు

**ప్రజాపక్షం/మునుగోడు** : మండలంలోని గుండ్లారి గూడెం గ్రామానికి చెందిన జంగిలి నాగరాజును నల్లగొండ జిల్లా ఎస్సి,ఎస్‌టి విజిలెన్స్అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ గా నియమించారు.ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ నియామక పత్రాన్ని నాగరాజుకు అందజేశారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.తనను నమ్మి అప్పగించిన ఈ గురుతర బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తూ,ఎమ్మెల్యే పేరు నిలబడేలా పనిచేస్తానని తెలిపారు.

## చంద్రునాయక్ మృతి బాధాకరం



**ప్రజాపక్షం/చింతపల్లి** : బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రనాయకులు కేతావత్ బీల్యానాయక్ సోదరుడు కేతావత్ చంద్రునాయక్ మృతి బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని ప్రశాంతపురి తాండకు చెందిన చంద్రునాయక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రవీంద్రకుమార్ శనివారం చంద్రునాయక్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీరాష్ట్రనాయకులు కంకణాలవెంకటరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఉత్సవాలు

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ మునిసిపల్ కార్యాలయంలో శనివారం మునిసిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, కౌన్సిలర్లు, మునిసిపల్ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, మునిపిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



**ప్రజాపక్షం/నకిరేకల్:** నకిరేకల్ పట్టణంలోని ఆరో వార్డు తిప్పర్తి రోడ్డులో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గామాత మండపాన్ని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం మండపం వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు లింగాల వెంకన్న,చందుపట్ల సర్పంచ్ దిగోజు లతా వెంకటాచారి,మట్టిపల్లి వీరు,బిక్షమాచారి తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/అర్వపల్లి** : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటి సభ్యులు ప్రపంచం అంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శాంతి హోమం నిర్వహించారు. శనివారం మండలంలోని కొమ్మాల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాలాధార భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : లోకమాత దుర్గాదేవి కరుణ కటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని మాజీ కౌన్సిలర్ రంగినేని ఉమా లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 34వ వార్డులో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాజీ కౌన్సిలర్ రంగినేని ఉమా లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. శివరాత్రి రవి, చంద్రావతి, కలమ్మ, కనకమ్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చండూరు** : మండలంలోని పుల్లెంల గ్రామంలో శ్రీ భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ 11వ వార్షికోత్సవ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిపారవశ్యంతో కుంకుమ పూజలు నిర్వహించారు. ధనలక్ష్మి నాగార్జున రెడ్డి, పిన్నింటి నరేందర్ రెడ్డి, చెరుకు లింగయ్య, పిన్నింటి వెంకటరెడ్డి,గుండెబోయిన దిలీప్ యాదవ్, ముక్కముల రాజు, జనార్ధన్ రెడ్డి, విష్ణు,కిరణ్,పవన్ పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో ముదిరాజ్‌లు పాండవ వనవాసం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మహాభారతంలోని పాండవుల వనవాస ఘట్టాన్ని స్మరించుకుంటూ గరిడేపల్లిలో ముదిరాజ్ కులస్తులు శనివారం వానవాస కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీంతో బంధువుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి, మహిళలు గంపలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లారు. పాండవుల వేషదారణతో వనవాస ఘట్టాన్ని ప్రదర్శిస్తూ సంప్రదాయాలను చాటుకున్నారు. ముదిరాజ్‌ల జానపద గాథల ప్రకారం తమ మూలాలను యయాతి భారత, పాండువల వంశాలతో ముడిపెడుతూ పాండవులను కులదైవాలుగా భావిస్తుంటారు. అనంతరం గ్రామ శివారులోని పాండవుల దేవాలయం వద్దకు మేళాతాళాలతో వనవాసం వెళ్లి అక్కడే వంటలు వండుకుని పెద్దమ్మ తల్లికి నైవేద్యాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

## పైలాన్ ఎస్‌బిఐ పార్కు మందుబాబులకు అడ్డాగా మారిందా?

### చీకట్లో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం..పోలీసుల నిఘా పెంచాలని స్థానికుల విజ్ఞప్తి

**ప్రజాపక్షం/నందికొండ:** పైలాన్ కాలనీ లోని ఎస్‌బీఐ పార్కు మందుబాబుల ఆగడాలకు వేదికగా మారుతోందన్న ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. పార్కులో మద్యం సేవిస్తున్న కొందరు ఖాళీ మద్యం సీసాలను అక్కడే పడేస్తుండటంతో అవి పగిలి చెల్లాచెదురుగా పడుతున్నాయి. దీంతో పార్కులోకి వచ్చే ప్రజలకు,ముఖ్యంగా పిల్లలకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పార్కులో రాత్రి సమయంలో లైటింగ్ సదుపాయం లేకపోవడంతో రాత్రి వేళల్లో చీకటి అలుముకుంటోంది.విశాలమైన పార్కు కావడంతో లోపల ఏం జరుగుతుందో బయటకు



తెలియని పరిస్థితి నెలకొంటోందని,దీనివల్ల అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పార్కులో రాత్రి వేళల్లో పోలీసుల నిఘా పెంచి, మద్యం సేవించడం,ఖాళీ సీసాలను పడేయడం వంటి చర్యలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. పార్కులో తగిన లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు,తరచూ పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు, పార్కుకు కూతవేటు దూరంలోనే ప్రత్యేక దళాలు, కేంద్ర ప్రభుత్వ రిజర్వ్ బలగాలు ఉన్నప్పటికీ, ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయన్న అంశం చర్చనీయాంశంగా మారింది.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పార్కును అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంచి, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



## జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఏడుదొడ్ల

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా పెద్దసూరారం గ్రామానికి చెందిన ఏడుదొడ్ల వెంకట్రాంరెడ్డి నియమితులయ్యారు.ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.వెంకట్రాంరెడ్డి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియామకం కావడం పట్ల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ జెడ్పీటీసీ గుమ్ముల మోహన్ రెడ్డిలు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. తన నియామకానికి కృషి చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి,స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇబ్రహీం,ఆర్‌టిఏ సభ్యుడు కూసుకుంట్ల రాజారెడ్డి,ఏదుళ్ల మధుసూదన్ రెడ్డి,జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాదం అనిల్,పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి నాగరాజు,కంచర్ల ఆనంద్ రెడ్డి,పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## ఇఎల్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మర్రిగూడలో ఘనంగా వేడుకలు



**ప్రజాపక్షం/మర్రిగూడ:** తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఇఎల్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు,సంప్రదాయ దుస్తుల్లో మహిళల సందడి, బతుకమ్మ పాటలు, ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.ఈ వేడుకల్లో పాల్గొన్న ఇఎల్‌వి ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఫౌండేషన్ మండల కన్వీనర్ ఐతగోని నర్సింహ పర్యవేక్షణలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు కమ్మంపాడు వెంకటేష్,ఫౌండేషన్ సభ్యులు,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఆనంతరం ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను అందజేశారు.

## నిరుపేదల గుడిసెలను కూల్చివేయటం అన్యాయం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండలం జలాల్‌పురం గ్రామంలో ఇళ్ళులేని నిరుపేదల గుడిసెలను ప్రభుత్వ అధికారులు కూల్చివేయటం అన్యాయామని బాధితులను ఆదుకొని ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని ఆగ్రామ సర్పంచ్ శాపాక లింగస్వామి డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 80 లో మూడు రోజుల క్రితం పేదలు నిర్మించుకున్న తాత్కాలిక గుడారాలను నేలమట్టం చేసి నిరాశ్రియులను చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇళ్ళు కోల్పోయిన బాధితులను శనివారం ఆయన పరామర్శించి న్యాయంతో పాటు నష్ట పరిహారం చెల్లించాలని రోడ్డున పడేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

